క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: టీఎస్ఎస్‌పీడీసీఎల్ 11కేవీ ఆజామాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఏడీఈ విజయభాస్కర్ తెలిపారు. నారాయణగూడ ఫీడర్ పరిధిలో బాగ్‌లింగంపల్లి, ఈడబ్ల్యూఎస్ క్వార్టర్స్, సూర్యనగర్, దీపక్ థియేటర్, అరోరా డిగ్రీ కళాశాల తదితర ప్రాంతాల్లో 9.30 గంటల నుంచి 12 గంటల వరకు, చిక్కడపల్లి ఫీడర్ పరిధిలో వేంకటేశ్వరస్వామి దేవాలయం, ఉమాగార్డెన్ తదితర ప్రాంతాల్లో 11 గంటల నుంచి 2 గంటల వరకు, పార్శిగుట్ట ఫీడర్ పరిధిలో ప్రేయర్ పవర్ చర్చి, బాప్టిస్ట్ చర్చి, బ్రహ్మంగారి దేవాలయం తదితర ప్రాంతాల్లో 2 గంటల నుంచి 5 గంటల వరకు, 44 బస్టాప్ ఫీడర్ పరిధిలో ఫిష్ మార్కెట్, గంగపుత్ర కాలనీ, ఫ్రెండ్స్‌కాలనీ, రామాలయం, అంజయ్య నాలా తదితర ప్రాంతాల్లో 3 గంటల నుంచి 5 గంటల వరకు ఈ కోత ఉంటుందని తెలిపారు.

నియామకం

ముషీరాబాద్: తెలంగాణ బట్రాజు సంఘం రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శిగా భరద్వాజరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన నియామకాన్ని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.నర్సింహ్మరాజు ప్రకటించారు. మంగళవారం ముషీరాబాద్‌లోని సంఘం కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కేశవనాని ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భరద్వాజరాజు మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా బట్రాజు కులస్తులను ఐక్యపరిచి తమ న్యాయమైన హక్కుల సాధనకు పోరాడుతామన్నారు. విద్యా, ఉపాధి, రంగాల్లో యువతకు అధిక ప్రాధాన్యత లభించేలా అంకితభావంతో కృషి చేస్తానన్నారు. సంఘం నాయకులు మోహన్‌రాజు, వేణుగోపాల్, బాలరాజు, మురళీధర్, కరుణాకర్, విజయరామరాజు, సంతోష్ తదితరులున్నారు.

గురువులకు సత్కారం



నల్లకుంట: గురు పౌర్ణమి సందర్భంగా పలువురు గురువులను విద్యార్థులు సత్కరించారు. మంగళవారం నల్లకుంటలోని శ్రీ సాయి శృతి మ్యూజిక్ అకాడమీలో సంగీత కచేరీ నిర్వహించి అనంతరం గురువులను సత్కరించారు. అకాడమీ డైరెక్టర్ గొరీభట్ల వసుధామూర్తి సంగీత విద్యార్థులు పాల్గొన్నారు. ఫీవర్ ఆసుపత్రిలో టీఎంహెచ్ఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాలిగామ అశోక్‌ను సన్మానించారు. టీఎంహెచ్ఈయూ ఫీవర్ ఆసుపత్రి శాఖ అధ్యక్షురాలు లావణ్య, నాయకులు పద్మజ, జనార్దన్, శివకుమార్, సత్యనారాయణ, అనిల్, పద్మజ, గోపికృష్ణ, సంతోష్, శ్రీకాంత్, అస్గర్ అలీ, ప్రవీణ్, యాస్మిన్, షబానా, నిర్మల, యాదమ్మ, భాగ్యలక్ష్మి, రాఘవేందర్, నళిని, మౌనిక, నవనీత, విజయ, చారి, వెంకటరమణ తదితరులున్నారు.

నల్లకుంట: శివం సిండికేట్ బ్యాంక్ చౌరస్తా సమీపంలోని సరస్వతీ సంగీత విద్యాలయంలో సంగీత కచేరీ, గురు సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస శర్మ విద్యార్థులతో కలిసి ఆలపించిన త్యాగరాజ స్వామి కీర్తనలు ఆకట్టుకున్నాయి. సంగీతం విద్యార్థులు సంగీత విద్యాలయం ప్రిన్సిపాల్ పోపూరి శ్రీనివాసశర్మను శాలువాతో సన్మానించారు. విద్యాలయం మ్యూజిక్ టీచర్లు యశస్విని, తేజస్విని, విద్యార్థులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

కాచిగూడ: రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మంగళవారం రైల్వే హెడ్ కానిస్టేబుల్ సమ్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. వట్టెపల్లి ప్రాంతానికి చెందిన ఖాజా అజారోద్దీన్ (33) ఫలక్‌నుమా - బుద్వేల్ రైల్వే స్టేషన్ల మధ్య పట్టాల వెంట నడుచుకుంటూ వెళ్తుండగా.. రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఏటీఎంలో రూ.7 లక్షలు డిపాజిట్ చేస్తుండగా చోరీ

చిక్కడపల్లి: ఏటీఎంలో డబ్బులు డిపాజిట్ చేస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు డబ్బులు లాక్కుని పరారైన సంఘటన దోమలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ దొంతిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం రాత్రి వెల్లడించిన వివరాల ప్రకారం..కేరళ ప్రాంతానికి చెందిన అబ్దుల్ ముజీబ్ బషీర్‌బాగ్‌లో నివాసం ఉంటున్నాడు. సోమవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో నారాయణగూడలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఏటీఎంలో డబ్బులు డిపాజిట్ చేసేందుకు వచ్చాడు. రూ.7 లక్షల నగదును డిపాజిట్ మెషిన్‌లో పెట్టే క్రమంలో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ఏటీఎంలోకి చొరబడి లాక్కుని పారిపోయారు. ఈ మేరకు బాధితుడు గూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీసీ పుటేజీల ఆధారంగా కేసును దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా దొడ్డి కొమురయ్య వర్ధంతి



బీజేపీ ఓబీసీ మోర్చా హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు వినోద్‌యాదవ్

తొలి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరుడికి నివాళులు



నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు దివ్య, అమృత, వనం రమేష్

నల్లకుంట: కురుమ సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి ఆద్యుడు, తొలి అమరుడు దొడ్డి కొమరయ్య వర్ధంతిని మంగళవారం నల్లకుంటలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన బీజేపీ కేరళ మహిళా నాయకురాలు బిందు, స్థానిక కార్పొరేటర్ వై.అమృత, బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు వనం రమేశ్, డివిజన్ అధ్యక్షుడు రమణానాయుడు, నాయకులు ఎంబీ కిశోర్, మధుయాదవ్, కురుమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

కాచిగూడ చెప్పల్ బజార్‌లో..

కాచిగూడ: తాడిత, పీడిత ప్రజలను నిజాం పాలకుల దుర్మార్గాల నుంచి విముక్తి కల్పించిన గొప్ప పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య అని బీజేపీ ఓబీసీ మోర్చా హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు సి.వినోద్‌యాదవ్ కొనియాడారు. మంగళవారం కాచిగూడ చెప్పల్‌బజార్‌లోని మహేంద్ర గార్డెన్స్‌లో స్వాతంత్ర్య సమరయోధుడు దొడ్డి కొమురయ్య 77వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వినోద్‌యాదవ్ మాట్లాడుతూ... తెలంగాణ సాయుధ పోరాటంలో వీర మరణం పొందిన దొడ్డి కొమురయ్య చేసిన త్యాగం చిరస్మరణీయమన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించిన కొమురయ్య జీవిత చరిత్రను రాష్ట్ర ప్రభుత్వం పాఠ్య పుస్తకాల్లో చేర్చి ఆయన కాంస్య విగ్రహాన్ని నగరంలోని ప్రధాన కూడలిలో ప్రతిష్ఠించాలన్నారు. వెంకటేష్, ఎం.బీ.కిషోర్‌కుమార్, రవీందర్ అందాస్, ఈశ్వర్, యాదయ్య, వివేక్ తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ ప్రభుత్వ సేవలను నియంత్రించేందుకే ఆర్డినెన్స్



మాట్లాడుతున్న ఆప్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్

కవాడిగూడ: దేశ రాజధాని ఢిల్లీలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ఆమ్‌ఆద్మీ పార్టీ ప్రభుత్వ సేవలను నియంత్రించేందుకు కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ఆర్డినెన్స్ రాజ్యాంగ విరుద్ధమని ఆమ్‌ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ అన్నారు. ఇది ఎన్నికలేని లెఫ్టినెంట్ గవర్నర్ చేతిలో అధికారాలు కల్పించడమేనని ఆయన విమర్శించారు. ఈ మేరకు మంగళవారం దోమలగూడలోని లిబర్టీలోని ఆప్ కార్యాలయంలో ఎన్నికైన ప్రభుత్వ పౌర సేవలను నియంత్రించే నల్ల ఆర్డినెన్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ.. నిరసన సభ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య వ్యతిరేక ఆర్డినెన్స్‌లు తీసుకొచ్చి దేశ సమాఖ్య నిర్మాణాన్ని నాశనం చేస్తోందని ఆరోపించారు. ఆప్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు బుర్రా రాముగౌడ్, ఎండీ మాజీద్, డాక్టర్ పాండు రంగయ్య, అధికార ప్రతినిధులు ప్రవీణ్‌యాదవ్, పరిరక్షణ్‌రాజ్, మహమూద్ అలీ, శేషాన్, షహదత్, జైసింగ్, శ్రీనివాస్, మోమిన్, జావీద్ షరీఫ్, సలావుద్దీన్, రాజేష్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సత్కారం



కాచిగూడ: ముదిరాజ్ చైతన్య వేదిక ఆధ్వర్యంలో రాష్ట్రంలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన ముదిరాజ్ ప్రముఖులకు 'పండుగ సాయన్న' పేరుతో సేవా పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్ వెల్ఫేర్ అసోసియేషన్ జాక్ అధ్యక్షుడు తుమ్మల రవీందర్ ముదిరాజ్‌ను తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర కో- ఆర్డినేటర్ రాజేందర్‌ముదిరాజ్ శాలువ, పూలమాల, జ్ఞాపికతో ఘనంగా సత్కరించి అభినందించారు. శివముదిరాజ్, రమేష్, వెంకటేశ్వర్లుముదిరాజ్ తదితరులున్నారు.

పండుగలు శాంతియుతంగా నిర్వహించుకుందాం



ఇన్‌స్పెక్టర్ రామలక్ష్మణ్ రాజును సత్కరిస్తున్న దృశ్యం

కాచిగూడ: పండుగలను శాంతియుతంగా నిర్వహించుకునేందుకు స్థానికుల సహకారం అవసరమని కాచిగూడ ఇన్‌స్పెక్టర్ ఎస్. రామలక్ష్మణ్ రాజు అన్నారు. కాచిగూడ పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో బోనాల వేడుకల ఏర్పాట్లపై పీస్ కమిటీ, మైత్రి కమిటీ ప్రతినిధుల సమావేశం జరిగింది. ఒకరి మనోభావాలను గుర్తిస్తూ.. అందరూ కలిసికట్టుగా పండుగలను నిర్వహించుకుందామన్నారు. కాచిగూడలో బోనాల వేడుకలకు ప్రాధాన్యత పెరిగిందని బోనాల ఉత్సవాలను తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారన్నారు. తొట్టెల ఊరేగింపు మార్గంలో మైత్రి, పీస్ కమిటీసభ్యులు ఎంతో జాగ్రత్తగా ఉంటూ.. ఊరేగింపులో అపరిచిత వ్యక్తులను గమనిస్తుండాలని అనుమానస్పదంగా తిరుగుతున్న వారిని గుర్తించి పోలీసులకు అప్పగించాలన్నారు. సెంట్రల్ పీస్ కమిటీ ఈస్ట్‌జోన్ అసిస్టెంట్ సెక్రటరీ ఎస్.శరత్ శ్యామ్ ఆధ్వర్యంలో పీస్ కమిటీ ప్రతినిధులు ఇన్‌స్పెక్టర్ రామలక్ష్మణ్ రాజును సత్కరించి అభినందించారు. డాక్టర్ యూసుఫ్ అహ్మద్, దిలీప్‌జైన్, ఖలీద్, కల్యాణ్‌రాజ్, శివమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆశీర్వాదం



నల్లకుంట: విష్ణు సహస్రనామ స్తోత్ర క్షేత్రం ట్రస్టు ఆధ్వర్యంలో బండ్లగూడ ఆశ్రమంలో విష్ణు సహస్రనామ స్తోత్రాన్ని పఠించారు. సంగీత విద్యాలయం ప్రిన్సిపాల్ పోపూరి శ్రీనివాసశర్మ పరమహంస పరివ్రాజకాచార్య బ్రహ్మానంద తీర్థయతీశ్వరులను కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. రామ్మోహన్‌రావు, కామేశ్వర్‌రావు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలి



పుస్తకావిష్కరణలో పాల్గొన్న వక్తలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రీడ్ ఇండియా గ్రూప్ ఆఫ్ లైబ్రరీస్ ఆధ్వర్యంలో 50 మంది ప్రతిభావంతులైన రచయితలతో 100 పుస్తకాల ప్రత్యేక సేకరణ సెట్ ఇంటింటికి గ్రంథాలయం పేరుతో జ్ఞాన దీపిక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సంగారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్ వీరారెడ్డి, కడప ఎక్సైజ్ డీఎస్పీ విశ్వక్సేనుడు వినోద్, రీడ్ ఇండియా గ్రూప్ ఆఫ్ లైబ్రేరియన్ నిర్వాహకుడు రామ్మోహన్ రెడ్డి, ప్రముఖ రచయితలు వశిష్ఠవంశీ, శ్రీనాథచారిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా సంగారెడ్డి జాయింట్ కలెక్టర్ వీరారెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుత యువత సోషల్ మీడియా మత్తులో విలువైన కాలాన్ని వృధా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియా మత్తులో చదువును నిర్లక్ష్యం చేస్తూ.. కాలం వృధా చేస్తూ ఎవరితో సంబంధం లేని ఉపయోగంలేని ప్రపంచాన్ని సృష్టించుకుంటున్నారన్నారు. కడప ఎక్సైజ్ డీఎస్పీ మాట్లాడుతూ.. రోజూ కొంత సమయం పుస్తకం చదవడానికి కేటాయించడం వలన క్రమశిక్షణ అలవడుతుందన్నారు. పుస్తక పఠనంతో మనస్సుకు ప్రశాంతత కొత్త విషయాలు నేర్చుకోవాలనే ఉత్సాహం ఏర్పడుతుందన్నారు.

కార్మికుల సంక్షేమానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న వేముల మారయ్య

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రంలో కార్మికుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న సీఎం కేసీఆర్‌కు కార్మికుల మద్దతు ఎల్లప్పుడు ఉండాలని బీఆర్‌టీయూ ఉపాధ్యక్షుడు వేముల మారయ్య అన్నారు. సీఎంతో పాటు బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబుయాదవ్ కూడా కృషి చేస్తున్నారన్నారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలో మారయ్య మాట్లాడుతూ.. కార్మికులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారానికి సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీష్‌రావు, రాంబాబుయాదవ్‌లు పనిచేస్తున్నారన్నారు. రాష్ట్ర కనీసవేతన సలహా మండలి సభ్యులు శివశంకర్, నాయకులు సాంబశివరావు, లక్ష్మణ్‌కుమార్, శంకర్ రెడ్డి తదితరులున్నారు.

'విశాల శూన్యం' కవితా సంపుటి ఆవిష్కరణ



ఇనాక్ కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న మధుసూదనాచారి

చిక్కడపల్లి: శ్రీ త్యాగరాయ గానసభలోని కళా సుబ్బారావు కళా వేదికపై గానసభ ఆధ్వర్యంలో జరుగుతున్న ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహితీ సప్తాహంలో భాగంగా ఇనాక్ రచించిన 'విశాల శూన్యం' కవితా సంపుటిని మంగళవారం శాసన మండలి సభ్యుడు ఎస్.మధుసూదనాచారి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుకూల పరిస్థితుల్లో సంఘర్షణల మధ్య జీవితాన్ని శిల్పంగా చెక్కుకొన్న ఇనాక్ తమ గురువు జయశంకర్‌కు అభిమాని అని అన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతవహించిన సభలో కవి బిక్కి కృష్ణ, రాజగోపాల్, ఉప్పల శ్రీనివాస్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు. మల్లాది ఉష శిష్యబృందం ఆలపించిన పాటలు సభికులను అలరించాయి.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

కాచిగూడ: తెలంగాణ ప్రగతి సేవా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. మంగళవారం నాలుగు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేసినట్లు ట్రస్ట్ ప్రతినిధులు నరేందర్‌గౌడ్, పొట్లకాయల వెంకటేశ్వర్లు ముదిరాజ్ తెలిపారు. బుధవారం నగరంలోని మరికొన్ని ప్రభుత్వ పాఠశాల్లో నోట్‌బుక్స్ పంపిణీ చేస్తామన్నారు. బిక్షపతిరాజుముదిరాజ్, నర్సింగ్, వరుణ్‌తేజ్, మధులత తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న నరేందర్‌గౌడ్, వెంకటేశ్వర్లు

అభివృద్ధి కార్యక్రమాలను గడపగడపకు తీసుకెళ్లాలి



ముషీరాబాద్: రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ నాయకత్వంలో తీసుకొచ్చిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను గడపగడపకు తీసుకెళ్లాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ముఠా జైసింహ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మంగళవారం రాంనగర్ డివిజన్ 49 బూత్ కమిటీ సభ్యుల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఏ రాష్ట్రంలో చేపట్టని విధంగా సంక్షేమ పథకాలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని వీటన్నింటినీ ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. డివిజన్ అధ్యక్షుడు రావులపాటి మోజెస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మన్నె దామోదర్‌రెడ్డి, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు వెల్లంకి ఇంద్రసేనారెడ్డి, కె.లీలాదేవి, జ్ఞానేశ్వర్‌గౌడ్, రాజు పాల్గొన్నారు.

బోనాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ముఠాగోపాల్ తదితరులు

ముషీరాబాద్: తెలంగాణలో బోనాల పండుగను అత్యంత ఘనంగా నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వం శర వేగంగా ఏర్పాట్లు చేస్తుందని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. మంగళవారం ముషీరాబాద్ డివిజన్ పరిధిలోని వినోబానగర్‌లో శ్రీకాంత్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో బోనాల పండుగ సందర్భంగా అమ్మవారి కమాన్లకు ప్రత్యేక పూజలు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆషాఢమాసం బోనాల పండుగ సందర్భంగా దేవాలయాలను అత్యంత సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రతి దేవాలయానికి ప్రభుత్వం ఆర్థిక సహకారం అందించిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. బోనాల పండుగ ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎం.ఎన్. శ్రీనివాసరావు, ఎడ్ల హరిబాబుయాదవ్, బీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర నాయకులు ముఠా జైసింహ, సోమసుందర్, శివముదిరాజ్, శ్రీధర్‌రెడ్డి, రాకేష్‌కుమార్, పూస గోరఖ్‌నాథ్ తదితరులున్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి



కుద్బిగూడలో పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ పావని, జలమండలి అధికారులు

కాచిగూడ: కుద్బిగూడలో తాగునీటి లో-ప్రెషర్ సమస్యను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కాచిగూడ డివిజన్ కుద్బిగూడ, మణియార్‌పట్టి, చెప్పల్‌బజార్ తదితర ప్రాంతాల్లో అధికారులు, సిబ్బందితో కలిసి ఎమ్మెల్యే పాదయాత్ర చేసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నీటి సరఫరాలో తలెత్తుతున్న లో ప్రెషర్, కలుషిత తాగునీటి సరఫరా సమస్యలపై అధికారులతో చర్చించి పరిష్కరించాలన్నారు. జలమండలి డీజీఎం సన్యాసిరావు, ఏఈ భావన, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్‌యాదవ్, జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ దిడ్డి రాంబాబు, బీఆర్ఎస్ కాచిగూడ డివిజన్ అధ్యక్షుడు ఎర్ర భీష్మదేవ్, కార్యదర్శి కె.సదానంద్, ఓంప్రకాష్‌యాదవ్, దాత్రిక్ నాగేందర్ బాబ్జీ, సునిల్ ఉన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన..

చిక్కడపల్లి: లోప్రెషర్‌తో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్ తెలిపారు. ఆర్టీసీక్రాస్‌రోడ్డులోని పంచముఖి ఆంజనేయస్వామి ఆలయం వద్ద రూ.13.75 లక్షల అంచనావ్యయంతో టి.జంక్షన్‌తోపాటు పలు నూతన పైప్‌లైన్ పనులను గత ఏప్రిల్‌లో ప్రారంభించారు. ప్రస్తుతం కొనసాగుతున్న పనులను మంగళవారం కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్ జలమండలి అధికారులు డీజీఎం కార్తీకరెడ్డి, మేనేజర్ కలిసి పర్యవేక్షించారు. టి.జంక్షన్ ఏర్పాటుతో డివిజన్‌లో నెలకొన్న తాగునీటి లోప్రెషర్ సమస్యను అధిగమించవచ్చన్నారు. వర్క్స్ ఇన్‌స్పెక్టర్ శంకర్, నర్సింగ్‌రావు, బీజేపీ నాయకులు వినయ్‌కుమార్, నర్సింగ్‌రావు, ఆకుల సురేందర్, ఆనంద్‌రావు, బాలు, సుధాకర్ పాల్గొన్నారు.

అర్హులకు ప్రభుత్వ పథకాలను అందించాలి



వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నేత గౌతంరావు

నల్లకుంట: అర్హులైన పేదలకు రేషన్‌కార్డులు, డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరు చేయాలని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్. గౌతంరావు రెవెన్యూ అధికారులను కోరారు. అర్హులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలని కోరుతూ.. మంగళవారం బీజేపీ నాయకురాలు బిందు, నల్లకుంట కార్పొరేటర్ అమృతతో కలిసి గౌతంరావు హిమాయత్‌నగర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా కార్యదర్శి నాయిని బుచ్చిరెడ్డి, హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఓబీసీ మోర్చా కార్యదర్శి ఎంబీ కిశోర్, ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్, నల్లకుంట డివిజన్ అధ్యక్షుడు రమణానాయుడు, మంగి శివకుమార్, ఇర్ఫానాసుల్తానా పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను గద్దె దించడమే లక్ష్యంగా పనిచేయాలి..

కాచిగూడ: తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దింపడమే లక్ష్యంగా పార్టీ కార్యకర్తలు క్రమశిక్షణ గల సైనికుల్లా పనిచేయాలని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు పిలుపునిచ్చారు. మంగళవారం బర్కత్‌పురలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు పార్టీ జాతీయ నాయకత్వం పార్టీలో చేపట్టిన మార్పులు దోహదం చేస్తాయన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా జి.కిషన్‌రెడ్డిని, పార్టీ ఎన్నికల కమిటీ చైర్మన్‌గా ఈటల రాజేందర్‌ల నియామకంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణలో కుటుంబపాలన, అవినీతి పాలనను అంతం చేసేందుకు ఈ నియామకాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. రాష్ట్రంలో పార్టీని క్షేత్ర స్థాయికి తీసుకెళ్లేందుకు బండిసంజయ్ చేసిన కృషి విశేషమన్నారు. కేసీఆర్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై విశేషమైన పోరాటాలు చేశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఓడించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా బీజేపీ ముందుకు సాగుతుందన్నారు. బీజేపీ నేతలు ఎ.సూర్యప్రకాష్‌సింగ్, కేశబోయిన శ్రీధర్, నందకిషోర్‌యాదవ్, వినోద్ కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు



డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్

కాచిగూడ: ప్రజా సమస్యలను పరిష్కరించడంలో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం తగదని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్ హెచ్చరించారు. నారాయణగూడ చౌరస్తాలో ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద గత వారం రోజులుగా డ్రైనేజీ పొంగిపొర్లుతున్నా.. అధికారులు, సిబ్బంది ఏమాత్రం పట్టించుకోకపోవడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ప్రజలు మంగళవారం సమస్యను కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. సానుకూలంగా స్పందించిన ఆమె పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు, సిబ్బందిని పిలిపించి డ్రైనేజీ సమస్యను పరిష్కరించారు. దీంతో స్థానికులు కార్పొరేటర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ నేతలు కన్నె రమేష్‌యాదవ్, బండారు సంతోష్, ఆర్.సంతోష్ పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆకాంక్షించారు. మంగళవారం అంబర్‌పేట డివిజన్ ప్రేమ్‌నగర్‌లో పీసీఐ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లారా మహిళా క్లౌడ్ కిచెన్‌ను స్థానిక కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే అన్ని కుటుంబాలు అభివృద్ధిలోకి వస్తాయన్నారు. బీఆర్ఎస్ అంబర్‌పేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎడ్ల సుధాకర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు కె.పద్మావతిరెడ్డి, పులి జగన్, బీజేపీ నాయకులు ఆనంద్‌గౌడ్ వినోద్‌కుమార్, శ్రీనివాసులు, జాకబ్, లత, సంధ్య, రాజేశ్వరి, దేవి తదితరులున్నారు.

కార్మికులకు కనీస వేతనాల జీవోలను వెంటనే విడుదల చేయాలి

చిక్కడపల్లి: రాష్ట్రంలోని అన్ని రంగాల కార్మికులకు కనీస వేతనాల జీవోలను వెంటనే విడుదల చేయాలని బీఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తూర్పు రాంరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్టీసీక్రాస్ రోడ్డులోని లేబర్ కమిషనర్ కార్యాలయం ముందు బీఎంఎస్ ఆధ్వర్యంలో కనీస వేతనాలను పెంచాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన రాంరెడ్డి మాట్లాడుతూ కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేస్తామని చెప్పిన ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. కనీస వేతన సలహామండలిలో బీఎంఎస్ సభ్యులను వెంటనే నియమించాలన్నారు. కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కాంట్రాక్టర్ మారినా సదరు ఉద్యోగిని కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు రవీంద్రరాజు వర్మ, కార్యదర్శి లక్ష్మీనారాయణ, నాయకులు శ్రీనివాస్, దుర్గాచారి, నరసింహారెడ్డి, జె.రామ్మోహన్, వెంకటేష్, రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.